# సుడిగుండాలు

జి. వి. జి. కృష్ణ

నిజానికి నాన్నే బ్రతికివుంటే అమ్మకి ఈ వయస్సులో ఇన్నికష్టాలుండేవా? పొలం పనులూ, ఇంటిపనులూ సర్వం ఆవిడ ఒకత్తే చూసుకోవాలి. తమ్ముడికి పదహారేళ్లొచ్చినై. కాని ఏం ప్రయోజనం? వాడికి ఏడోయేట నించి శరీరం ఎదగ నారంభించి మెదడు పెరగటం తగ్గిపోయింది. వీధిబడిలో ఐదవ తరగతివరకూ ఎంత చదివాడో అంతే! ముప్పొద్దులా తిని ఊర్లోని తోటి నేస్తాలతో గాలిపటాలు ఎగరేయటమో, గోలీ కాయలూ బొంగరాలూ ఆడటమో తప్పితే తల్లికి ఏపనిలోనూ సహాయం చెయ్యడు! భర్త ఆఫీసుకెళ్ళాక నాలుగు గోడలమధ్య కూర్చొని ఈవిధంగా పుట్టింటినిగూర్చి తలపోస్తూ దుఃఖించేది సుశీల.

భార్యకు పుట్టింటిమీద మమత ఇంకా తీరలేదన్న విషయం శ్రీహరికి తెలియకపోలేదు. అంచేత ఆఫీసు వదలగానే తిన్నగా ఇంటికి చేరుకునేవాడు. ఇంట్లో వున్నంత సేపూ భార్యకు ఇంటిపనులలో సాయపడ్తూనో, తమాషాగా కబుర్లు చెప్తూనో, భార్య మమతను మరిపింప చూసేవాడు. అప్పుడప్పుడూ బీచ్ కీ, సినిమాలకూ, షాపింగుకని చైనాబజార్ కూ - ఇక్కడికీ అక్కడికీ సుశీలను తీసుకువెళ్లేవాడు. తను ఇంట్లో లేనప్పుడు భార్యకు పొద్దు గడవ దేమోనని, పత్రికలూ నవలలూ ఎన్నో తెచ్చి ఇంట్లో పడేసేవాడు.

* * *

రాత్రి పదిగంటలు దాటింది. మేజా ముందు కూర్చొని ఏదో రాస్తున్నాడు శ్రీహరి. సుశీల లేచివచ్చి అతని ఉంగరాలజుట్టు సవరిస్తూ "మా అమ్మని చూడాలని వుందండీ" అంది దీనంగా.

"ఓ దానికేం?" ముందు పరధ్యానంగా అనేసి, తర్వాత తెప్పరిల్లాక "ఇంకో రెండుమూడు మాసాలవరకూ సెలవు దొరకదు సుశీలా!" అన్నాడు శ్రీహరి.

"మనం అక్కడికి వెళ్లలేకపోతే...పోనీ వాళ్ళిక్కడికి ఎందుకు రాకూడదండీ?"

"ఔనూ—ఎందుకు రాకూడదూ?"

"అయితే-ఉత్తరం రాస్తాను ఇప్పుడే... పెనా ఇవ్వండి."

"అలమారులో ఇంకో పెన్ వుండాలి చూడూ" అంటూ సిగరెట్ వెలిగించి రాతలో మునిగిపోయాడు శ్రీహరి.

* * *

ఆ రాత్రే కూర్చొని పెద్ద ఉత్తరం తయారుచేసింది సుశీల. శ్రీహరి ఉత్తరాన్ని పోస్టు చేసిన రెండు రోజులకల్లా తిరుగు టపాలో మళ్లే బండి దిగారు, అత్తగారు రామమ్మ - బావమరిది నారాయణా.

తల్లినీ తమ్ముణ్ణీ చూడగానే సుశీల పొందిన ఆనందం ఇంతా అంతా కాదు. ఇక నారాయణ సంగతి చెప్పనక్కర్లేదు.

ఆ తారురోడ్లూ, ఎలక్ట్రిక్ దీపాలూ చూచేసరికి దాదాపు పిచ్చెక్కినంత పనైంది వాడికి. పట్టపగలే ఇంట్లో దీపాలు ఊరికే వెలిగించి ఆర్పేస్తూండేవాడు.

రెండు మూడు రోజుల తర్వాత ఓనాటి మధ్యాహ్నం నారాయణ రేడియో స్విచ్ వేసి తెగ తిప్పుతూంటే "ఒరేయ్! దాన్నలా తిప్పొద్దు...చెడిపోతుంది; మీ బావ ప్రాణాలంతా దానిమీదనే వున్నాయ్" అంది సుశీల. రామమ్మ బుగ్గలు నొక్కుకుంటూ "అవ్వ...వాడలా దాని మీద చేతులుంచితేనే చెడిపోతుందటే!... పోనీలేరా నారాయణా—మన కెందుకులే వాళ్ళ వస్తువు, అరిగిపోతుంది పాపం" అంటూ రుసరుసలాడింది.

"అబ్బ! అంతమాత్రానికే కోపమైతే ఎలాగ" తల్లి కళ్ళల్లోకి అదోలాగునచూస్తూ అంది సుశీల.

"లేకపోతే మరేమిటే! ... మొగుడంటే కాస్త భయం భక్తీ వుంటే వుండాల్సిందే కాని, మరీ అతన్ని భూతంలా దెయ్యంలా చూసి భయపడేదానివి నువ్వెందుకు పనికొస్తావే; మా కాలంలో మేమూ కాపురం చేశాం కానీ - ఐనా ఇలా కాదమ్మా!"

"నువ్వు చెప్పటం ఏమిటో నాకు బోధపడటం లేదమ్మా"

"ఎందుకు బోధపడ్తుందీ...ఐనా నీలాటి ఆడదాన్ని నేనెక్కడా చూళ్లేదే! నిన్న త్వరగా వంటచేసి పెట్టలేదని అతను కేకలేస్తూంటే గజగజా వొణికిపోయావ్! ఇంత పిరికిదానివి నాకడుపున ఎలా పుట్టావే?"

"అవును మరి ... వారికి ఆఫీసుకి వేళయింది - అందుకని కేకలేశారూ..."

"పోనీ ఆ సంగతి అలా వుంచు...నిన్న రాత్రి ఎన్ని గంటలకొచ్చాడు ఇంటికి? పది దాటిందా? అతనొచ్చేవరకూ తిండి తినకుండా కాచుక్కూర్చుని అవస్థపడ్డావే గాని, అతనింటికి రాగానే ఎందుకంత ఆలస్యం అయిందని అడిగావా?"

"వారికి బయట ఏదైనా పనులుండొచ్చు."

"ఆఁహా...పనులు! ఏం పనులే—నీకూ నాకూ తెలియని మహా పనులు! ఉద్యోగాలు చేసేవాళ్లందరూ ఇలాగే ఆలస్యంగా ఇంటికి చేరుకుంటున్నారా ఏమిటే? పోనీ, ఇంతకీ నీ భర్త కొచ్చే జీతం ఏమిటో నీకేమైనా తెలుసా? అతనన్నా ఎన్నడైనా చెప్పాడా నీతో?"

"ఇంటికి కావాల్సిన బజారు సామానులంతా తెచ్చి పడేస్తారు, అలాటప్పుడు వారి జీత మెంతయితే నాకేం? వారు మాత్రం నాతో చెప్పాల్సిన అవసరం ఏముందీ?"

"ఎందుకు చెప్తాడులేవే—నాకంతా తెలుసు; ఇది పల్లెటూరి పశువుకదా—దీని కెందుకు చెప్పాలీ అని అతని ఉద్దేశం..." అంటూ కాస్సేపాగి గద్గద స్వరంతో "ఆ మహారాజు ఏ స్వర్గాన వున్నాడో కానీ - అమ్మాయ్! ముందు నాతో ఓమాట చెప్పనిదే ఏ పనీ చేసేవారు కాదు మీ నాన్న" అంది.

"అదంతా ఎందుకే ఇప్పుడూ...ఆ బుద్ధి వారికే తోచి వారే స్వయంగా చెప్తే తెలుసుకోవాల్సిందే కానీ, నేనెలా నిలదీసి అడగనే...?"

"ఇలాటి స్వల్ప విషయాలే ఎరగని దానివి ఎలా సంసారం చేస్తున్నావే! ఇవి నువ్వు తెలుసుకోవలసినవే కాని ఒకరు చెప్పేవా? నీ మొగుడిమీద నీకు కాకపోతే మరెవరికి శ్రద్ధ వుంటుందే?.....అతను రోజుకు ఎన్ని పెట్టెల సిగరెట్లు తగలేస్తున్నాడో చూశావా? అతనిమీద నీకు శ్రద్ధ లేదు, నీమీద అతనికి శ్రద్ధ లేదు - ఇద్దరికీ సంసారంమీద బొత్తిగా శ్రద్ధలేదు. అతనూ కుర్రవాడూ - నువ్వూ కుర్రదానివీ. అతనికి బుద్ధి చెప్పే పెద్దలెవరూ లేరు, అతని ఇష్టం వచ్చినట్లు రాత్రిళ్లు ఏ—కొంపల్లోనో గడిపి, డబ్బంతా నాశనం

చేసుకొని ఆలస్యంగా ఇంటికి వచ్చినా వస్తాడు. అతన్ని అడిగేవారెవరు?"

"ఛా... అలా అనకు ... అలాటివారు కాదమ్మా."

"నాకు తెలుసు నువ్విలా అంటావని. ఏనా నీకులేని శ్రద్ధ నాకెందుకులే. నన్ను ఊరు పొమ్మంటూంది, అడవి రమ్మంటూంది. నీ మంచికే చెప్తున్నా, ముందు ముందు పిల్లా జెల్లా గలిగితే వాళ్ళకు పెళ్ళిళ్ళూ అవీ జరగాలా. వాటికి నీమొగుడు ఏ మాత్రం సొమ్ము వెనకేసుకొస్తున్నాడో చూసుకో... అంతే నేచెప్ప గల్గింది... ఏమిటో పై సంపాదన కూడా వుందీ - అని నువ్వనటమూ నే వినటమూ అంతే! మెడలో ఆ పుస్తె తప్ప మరేమీ లేదు. నువ్వు కాపురానికొచ్చి మూడునెలలు దాటింది కదా పోనీ ఒక్క పట్టుచీరయినా కొనిచ్చాడుటే ఆ పెద్దమనిషి?...ఏమిటో నా కడుపున పుట్టావు గనక నే నింతగా చెప్పాల్సొస్తూంది.—మీ నాన్నే బ్రతికివుంటేనా..." అంతే! తర్వాత మాట్లాడలేక పోయిందా ముసలామె. ఈమారు ఆవిడ కళ్ళల్లో నీళ్ళు నిలిచాయ్. తల్లి కన్నీళ్ళు చూసేసరికి కూతురి హృదయం ద్రవించింది.

* * *


ఆ వేళ రాత్రి...గడియారం పదకొండు గంటలు కొట్టింది. వీధి గుమ్మంవద్ద ఎంత సేపు ఎదురుచూస్తూ నిలుచొనుందో సుశీల, పెద్దగా నిట్టూరుస్తూ మళ్ళీ తలుపులుమూసి గొళ్ళెం పెట్టి వచ్చి మంచంమీద పడుకుంది. సాయంత్రం టీనీళ్ళు తప్ప మరేమీ త్రాగలేదు. కడుపులో ఆకలి దహించుకుపోతోంది. ఆవలింతలు కూడా వస్తున్నయ్. ఉన్నట్లుండి వీధితలుపు కొట్టిన చప్పుడు వినపడింది. తలుపు తెరవగానే "అబ్బబ్బ.. ఎంతసేపని తలుపు తట్టాలి?" రుసరుస లాడ్తూనే ఇంట్లో అడుగెట్టాడు శ్రీహరి.

"ఆలస్యంగా రావటమూ - పైగా కోపం నామీద చూపించటమూ...బావుందండీ -" అంది సుశీల.

భార్య అదో కొత్తధోరణిలో మాట్లాడుతూంటే శ్రీహరి మెదడులో ఎన్నో ఆలోచనలు రాసాగినాయ్. ఆవిడ అలా అంటూంటే అతని ఒంటిమీద తేళ్ళూ, జెఱ్ఱులూ ప్రాకినట్లయింది. వంటింటి తలుపు చాటున నిలుచొనివింటూన్న రామమ్మకూ, నారాయణకూ ఆశ్చర్యం వేసింది-సుశీలకు ఎన్నడూ లేనంత తెలివి ఈ వేళ ఎక్కడ్నించి ఊడిపడిందా అని.

షర్ట్ విప్పుతూ "క్లబ్‌లో స్నేహితులు ఎంతసేపటికీ వొదల్లేదు" అన్నాడు శ్రీహరి.

"గట్టిగా పట్టుకున్నారా?"



"పట్టుకోవటం కాదు, ఎంత మొత్తుకున్నా వాళ్లు వింటేగా?"

"స్నేహితులంటే - మొగ స్నేహితులేనా?"

"ఏమిటె నువ్వనేది?...ఏమిటో కొత్తగా మాట్లాడుతున్నా వివ్వాళ?"

"రోజురోజుకూ మీరు కొత్తగా మారి పోతూంటే నామాటలూ మీ చెవులకు కొత్తగానే వుంటాయ్. ఇంతకీ పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగుతూంటే -"

"నోర్ముయ్!...పిచ్చిపిచ్చిగా వాగకు"

"ఒర్చుకొనిపోయేకొద్దీ మితిమీరిపోతున్నారు, అడిగే దిక్కెవరైనా వుంటేగా. ఇంట్లో భార్య వుందికదా, అది తిండీ తినకుండా నాకోసం కాచుకొని పడివుంటుంది కదా అని మీ మనసులో ఏమాత్రమైనా వుంటే మీ రిలాచేస్తారా? మీకేం, స్నేహితులతో హోటల్ కెళ్లి కడుపునిండా ఫలహారాలూ అవీ మెక్కుతారు, ఇక్కడ నేను ఆకలితో చచ్చిపోవాల్సిందే."

"నిన్నెవ్వరు భోంచేయొద్దన్నారూ? - నేరావటం ఆలస్యమైతే, భోంచేయకుండా నాకోసం కాచుక్కూర్చోవద్దని నీతో చెప్పాలా?

"మీకలాటిభార్య దొరికివుంటే ..."

# ★ సుడిగుండాలు ★

అంటూ ఏదో చెప్పబోయి ఆగిపోయింది సుశీల.

"నీ ప్రతాపాలకు సంతోషించాం కానీ, పన్నెండు గంటలు కావస్తోంది. కాళ్లు కడుక్కోటానికి నీళ్ళిచ్చి, పిండం పెట్టేయ్."

"హుఁ" అని ధర్తవంక, తీక్షణంగా చూస్తూ అక్కడ్నించి వెళ్లిపోయింది సుశీల.

* * *

మర్నాడు ఆదివారం. ఆఫీసు లేనందుచేత ఇంటివద్ద డెస్కు ముందు కూర్చొని ఏదో రాస్తున్నాడు శ్రీహరి. సుశీల వచ్చి కాఫీ గ్లాస్‌ను మేజామీద వుంచటంతో అతని రాతకు బ్రేక్ పడింది. గ్లాసును పెదవులదగ్గర వుంచుకుని భార్యకేసి ఓమారు చూశాడు శ్రీహరి. తెల్లచీర కట్టుకొని, కొప్పునిండా అర్ధచంద్రాకారంగా విరజాజిపూల నుంచుకుని వొయ్యారంగా నిలుచొనున్న సుశీల అప్పుడతని కళ్ళకు ఓ అప్సరసలా కనపడ్తూంది. కాఫీని కాస్త సేవించి "కోపమా" అన్నాడు లాలనగా.

మొహాన్ని అవైపుకు తిప్పుకుంటూ "ఎవరికి కోపం" అంది సుశీల కంటి రెప్పలను వొయ్యారంగా రెపరెపలాడిస్తూ. "ఐతే ఏదీ ఒక్క నవ్వు" అంటూ ఖాళీచేసిన కాఫీగ్లాసును ఆవిడ చేతికి అందిస్తూ, ఆవిడను దగ్గరికి తీసుకొని అన్నాడు. సుశీల పెదవులు బిగబట్టింది. "అదో—నవ్వొచ్చింది...నవ్వొచ్చింది." సుశీల పుటుక్కున నవ్వేసింది, ఆవిడ బుగ్గలు సొట్టలు పడ్డాయ్. ఆ సొట్టలు చూడటంతోనే కాస్సేపు మూర్ఛపడిపోదామా అనిపించింది శ్రీహరికి.

"చూడు సుశీలా!...ఆఫీసులో అలసి సొలసి అర్ధాయుస్సులో ఇంటికి చేరుకునే సమయానా, చిరునవ్వుతో స్వాగతవచనాలు పల్కాల్సింది పోయి, ఇంటికి వచ్చీ రాకముందే లేనిపోని అనుమానాలు పడి ఈ రాద్ధాంతాలంతా ఎందుకు చెప్పు? ..ఎల్లకాలమూ ఇలా వుంటే మన బ్రతుకు బజారులో పడదూ? మీ అమ్మా తమ్ముళ్లముందు మన మిలా ప్రతాపాలు ప్రదర్శిస్తూ కీచులాడూంటే ఎలా చెప్పు. మనల్ని చూసి వాళ్లేమనుకుంటారు?"

"మావాళ్లు అలా ఏమీ అనుకోరు."

"ఏమీ అనుకోరనేనా నిన్నరాత్రి అన్ని గొడవలు చేసింది?"

సుశీల జవాబు చెప్పటానికి నోరు తెరిచింది కాని, మళ్ళీ ఏమనుకుందో నోరు మూసుకుంది.

"జరిగిందేదో జరిగిపోయింది కానీ, ఇకనైనా బుద్ధిగావుండు...ఏం?" అన్నాడు శ్రీహరి.

శిరఃకంపనం చేసింది సుశీల. తర్వాత ఆ ప్రస్తావన మరిపించేందుకని "ఈ రోజుతో ఈ రేడియో స్క్రిప్టు పూర్తయిపోతుంది. అన్నాడు శ్రీహరి.

"అన్నట్లు ఎప్పుడండీ మీ ప్రసంగం?.. మీరు రేడియోలో మాట్లాడటం వినాలని నారాయణకు ఎంతో ఆశగా వుందట."

"వచ్చేదీ సెలవదిహేనవ తే!"

"అంటే - ఇంకా దాదాపు ఇరవైరోజులున్నాయన్నమాట...అంతవరకూ వుంటాడుగా, వింటాడు లెండి" అని సుశీల అంటే ఆవిడకేసి ఆశ్చర్యంగా చూశాడు శ్రీహరి. "అంతవరకూ ఇక్కడే వుంటారా సుశీలా! ఊరిలో పొలం పనులూ అవీ ఇవీ..."

"రైతులున్నారుగా, వాళ్లు చూసుకుంటారు. ఐనా మా అమ్మమాత్రం అక్కడుండి చేయగల్గిందేమిటి లెండి...ఎల్లకాలం వాళ్ళు మన ఇంట్లోనే వుంటారా—ఏదో వచ్చారు గనక కొద్దిరోజులుండి వెళ్ళిపోతారు లెండి"

"ఆఁహాఁ...అదికాదు...సైగ్గు నూర్పిడికి వచ్చే సమయమాయె—అందుకని అడిగానులే."

"వాళ్ళకు మాత్రం తెలీదటండీ - మన మిక్కడ పడేకష్టాలు? కానీ వాళ్ళను మళ్లీ ఎప్పుడు చూస్తానో ఏమో..అందుకని నేనే వుండమన్నాను. వాళ్లు వెళ్లిపోతే నాకీ ఒంటరిపాటు తప్పదుకదా" అని నిట్టూర్చి "అన్నం ఏమైందో చూసివస్తాను" అంటూ అక్కడ్నించి వెళ్లిపోయింది సుశీల.

* * *

కొన్నాళ్లుగడిచాక ఓరోజురాత్రి సుశీల అంది "మన ఇద్దరికీ ఇంత ఇల్లు ఎందుకండీ! వృథాగా ముప్ఫైయైదురూపాయల అద్దె."

"ఇంతకన్నా చిన్న ఇల్లు ఎక్కడైనా దొరికితే దొరకవచ్చుగాని, ఇన్ని సౌకర్యాలుంటాయా?"

"ఆఁహాఁ...అదికాదండీ నే నసేది!... ఈ పక్కగదిన్నీ, ఆ వెనుకగదినీ..."

"ఎవరికైనా బాడిగకు ఇస్తే మంచిదంటావ్! అంతేనా? బావుంది నీఆలోచన"

"ఎవరికో ఇవ్వక్కర్లేదు లెండి - మా అమ్మే ఉంటానంటూంది."

శ్రీహరి క్షణకాలం అవాక్కయిపోయాడు. కనుబొమలు చిట్లించి సుశీల కళ్ళల్లోకిచూస్తూ "మీ అమ్మ పల్లెకు వెళ్లదూ?" అని ప్రశ్నించాడు.

"వెళ్లినా ఆమె అక్కడ చేసేది ఏమిటి లెండి...నారాయణుడ్ని ఇక్కడే ఏదైనా బడిలో చేర్పించి చదివించాలని ఆశపడ్తూంది అమ్మ. ఏదో వాడు హైస్కూల్ చదువు

ప్రమాద రక్షణకు
ప్రశస్తమైనది
భీమా

ఎప్పుడే ప్రమాదం వచ్చేదీ, ఏ క్షణం ఎలా ఉండేదీ తెలియని ఈదినాల్లో
అగ్ని * మోటార్‌కార్ * కార్మిక నష్టపరిహారం
నౌక * ఫయడిలిటీ గ్యారంటీ * మొదలైన భీమాలకు
—మాతో సంప్రదించండి:—

యునైటెడ్ ఇండియా ఫైర్ అండ్
జనరల్ ఇన్సురెన్సు కంపెనీ లిమిటెడ్,

"యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్సు"
ఎస్‌ప్లనేడ్ - మద్రాసు.

Telephone : 4241. Telegrams : "UNIGEN"

బ్రాంచీలు :
బొంబాయి - కలకత్తా - కొలంబో - సింగపూరు - విజయవాడ -
ఢిల్లీ - పాట్నా - లక్నో - బెంగుళూరు - కోయంబత్తూరు.

## ★ సుడిగుండాలు ★

వరకైనా పూర్తిచేసి, ఎక్కడైనా ఉద్యోగం సంపాదించుకుంటే, వాడికి పెళ్ళి పెటాకులూ చేసి వాడింట్లోనే 'కృష్ణా రామా' అంటూ పడివుంటుంది. ఆమె ఇంక బ్రతికి వన్నాళ్లు బ్రతకదుకదా; మనం ఆమెకు చేయగల్గిన సాయం ఇంతకన్నా మరేం వుంటుందండీ? అదీగాక అమ్మ నాకు తోడుగా వుంటుంది. మాతమ్ముడు మార్కెట్టుకూ, బజారుకూ వెళ్లి సామానులు తేవటమో, లేక - ఇలాగే చిన్న చిన్న పనులు చెప్తే హనుమంతుడిలాగ చేసి పెట్తాడు. వాడికి చదువులో ఏమైనా తెలియకపోతే మిమ్మల్నడిగి తెలుసుకొంటాడు... ఏమంటారండీ" ప్రశ్నించింది సుశీల.

ఈ యోచన బాగా నచ్చినట్లు తోచింది శ్రీహరికి.

* * *

ఇదివరకూ శీల్ళ ఇంటికి ఎదురింట్లో కాపురం వుండిన అరవ్వాళ్లు ఖాళీచేసి పోగా, ప్రక్కవీధిలో కాపురం వుంటూండిన ఒక పురోహితుని సంసారం వచ్చి ఆ ఇంట్లో దిగింది. వాళ్ళు తెలుగువాళ్లే.

ప్రతిరోజూ మధ్యాహ్నంపూట భోంచేశాక రామమ్మ ఎదురింటికి వెళ్లి కూర్చునేది. తన అల్లుడిగురించి ఎవరైనా చెడ్డగా చెప్తే చాలు, వాళ్ళను తన అప్పులకన్నా హెచ్చుగా చూసుకునేది రామమ్మ. అవధాన్లుగారు ఈ విషయం ఇట్టే గ్రహించారు. అంచేత రామమ్మ ఆదరాభిమానాలను చూరగొనటానికి ఆయనకు ఎంతో కాలం పట్టలేదు. ఏ కాఫీపొడో, మంచినూనో ఇంట్లో లేకపోతే గరిట చేతబట్టి నేరుగా రామమ్మ ఇంటికి భార్యను బయలుదేరనిచ్చేవాడు అవధాన్లు. ఆమె లేదనకుండా ఇచ్చి పంపుతూండేది.

అవధాన్లుగారికి ఏకైక పుత్రుడు నూరి. స్కూల్ ఫైనల్ పరీక్షకు మూడోమారు కూర్చోబోతున్నాడు. దాదాపు ఇద్దరూ ఒకే వయస్సుగలవారవటంచేత నారాయణకూ నూరికీ కొద్దికాలానికే గాఢమైన స్నేహం ఏర్పడింది. నూరితో స్నేహమైన వారం రోజులకే నారాయణ మద్రాసంతా చూడగల్గాడు. ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాడు. నాయరాణుడు ఉత్త


# చతుర్విధ నివారణ



అనాసిన్, బాధలకు నాలుగు విధముల నివారణ ఇచ్చుటకు విజ్ఞాన శాస్త్ర రీతిగా చేర్చబడినది. ఎందుకనగా అది కలిసియుండు క్రింది ఔషధములే :-

1 క్వినైన్: అధిక శక్తి విచ్చు ఔషధమని మరియు జ్వరనివారణియని ప్రఖ్యాతిగాంచిన ఔషధ సమ్మేళనం. జ్వరాన్ని తగ్గించడంలో సాటి లేనిది.

2 కఫీన్ : బలహీనానికి మరియు చిక్కిపోయినందులకు తగిన ఔషధమని విరివిగా వాడబడుచున్నది.

3 ఫినాసిటిన్ : తీవ్రమైన బాధా నివారణి మరియు జ్వర నివారణియని ఖ్యాతిచెందినది.

4 అసిటైల్ సాలిసిలిక్ ఆసిడ్ : ఇది తలనొప్పి, మరియు అలాటి వివిధ బాధలను పోగొట్టుటకు ఉపయోగబడుచున్నది.

వైద్యశాస్త్ర రీత్యా లేక సమ్మేళన శక్తిచేత అనాసిన్ మాత్రం, త్వరితంగాను, నిరపాయంగాను, దృఢంగాను, బాధలనుండి, తలనొప్పి, జలుబు జ్వరం, దంతపు పోట్లు, కండరముల పోట్లు, వాయువు నొప్పులు మొదలగుబాధలను నివారించును.




ఎల్లప్పుడును
**అనాసిన్**
బిళ్లలే
కావలెననికోరండి

2 మాత్రలుగల పాకెట్టులందును. మరియు 32 మాత్రలుగల అలమారింపలేని డబ్బాలందును దొరకును.

అమాయకుడన్న విషయం మొదటి రోజునే గ్రహించాడు సూరి. ఎప్పుడైనా "ఒరేయ్! ఓ రూపాయి వుంటే పట్టుకు రారా— మంచి ఇంగ్లీషు పిక్చర్ వచ్చిందిట" అని సూరి చెప్తే చాలు, నారాయణుడు నేరుగా ఇంటికి వెళ్లి తల్లితో నానాపోరు చేసి డబ్బు తీసుకు వచ్చేవాడు. ఇంటినించి సునాయాసంగా డబ్బు తెచ్చే రెండు పద్ధతులను ఇటీవల సూరి నారాయణకు నేర్పించాడు: తల్లి ఏ ఇంగువ డబ్బాలోనో, దేవుడిపటం ముందో వుంచిన డబ్బు కాజేయడం— లేదా బజారుకు వెళ్ళి ఏ సామానైనా తెమ్మని వాళ్లక్కయ్య డబ్బిచ్చి పంపిస్తే, అందులో కమీషన్ కొట్టటం!

* * *

తల్లిదండ్రులు చనిపోయాక శ్రీహరిని చదివించి పెళ్లిచేసింది అతని మేనమామ నీలకంఠంగారు. పెళ్లయినతర్వాత కొంత కాలంనించీ - అంటే దాదాపు ఒక ఏడాదిగా వీళ్లిద్దరిమధ్యా ఉత్తరప్రత్యుత్తరాలు జరగటంలేదు. ఉన్నట్లుండి ఒకనాడు ఆయనవద్దనించి ఒక ఉత్తరం వచ్చేసరికి ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరై పోయాడు శ్రీహరి. వేసవిసెలవులు గనక తన కొడుకును మద్రాసు పంపిస్తున్నాననీ, వీలును బట్టి కొడుక్కు మద్రాసంతా చూపించి ఓవారం పదిరోజులుంచుకొని పంపించవలసిందని కోరుతూ రాశాడాయన. మేనమామ తనకు చేసినమేలుకు ఆయన ఋణం తీర్చుకునేందుకు సమయం వచ్చిందికదా అని ఉవ్విళ్ళూరుతూ ఆ అబ్బాయివచ్చిన మర్నాడే, ఆఫీసులో మూడురోజులపాటు సెలవుతీసుకొని మద్రాసులో చూడదగిన ప్రదేశాలన్నీ చూపించాడు. ఆ అబ్బాయి కోసం తనభర్త అనవసరంగా ఎంతో డబ్బు ఖర్చు పెడుతున్నట్లుగా భావించింది సుశీల. ఎవ్వరూ లేనిసమయాన భర్తముందు నెత్తీ నోరూ కొట్టుకొనింది.

ఆ అబ్బాయి ఈ గొడవ ఎక్కడవిని, ఊరికెళ్ళాక వాళ్లనాన్నతో చెప్తాడోనని భయపడి శ్రీహరి, ఐదురోజులు కాకమునుపే, వాడిని ఊరికి పంపించేయాలనుకున్నాడు. ఆరోజే ఆ అబ్బాయిని బజారుకు తీసికెళ్ళి ఒక జత చొక్కాలూ, ఒక జత నిక్కర్లూ కుట్టించాడు. ఆ కొత్తబట్టలతో శ్రీహరి ఇంటికి రాగానే "బాగా వుందండీ - సంసార లక్షణం!...అవ్వ!... ఎవరో మేనమామ కొడుకని ఇంత డబ్బు తగలేసే వాళ్లని నే నెక్కడా చూడలేదు" అంది సుశీల, ముక్కు మీద వేలేసుకుని.

"నా ఇష్టం... నేను చెమటోడ్చి సంపాదించిన డబ్బు నా ఇష్టంవచ్చినట్లు నేనే మైనా చేసుకుంటా - మధ్యన నువ్వెవరు అడగటానికి."

"ఔను... లోకంలో మీ రొక్కరే సంపాదిస్తున్నారు...హుఁ... సంపాదన! నా మెడకు ఓ గొలుసు చేయించటానికి డబ్బులేవుకానీ, ఇలాటి అడ్డమైన ఖర్చులకు డబ్బు వుంటుంది."

"నేను పరాయివాళ్ళెవరికీ చేయటం లేదు...మా మేనమామ కొడుక్కి."

"మేనమామ!..మహా మేనమామ లెండి."

"ఛీ" అంటూ అక్కడ ఒక్కక్షణం నిలవలేకపోయాడు శ్రీహరి.

* * *

ఆఫీసులోనైనా, మరెక్కడైనా - తీరికగా ఏకాంతంగా కూర్చొనివున్న సమయాల్లో శ్రీహరికి ఒకటే ఆలోచన - రాను రానూ తన భార్య ప్రవర్తనల్లో ఇంత విపరీతమైన మార్పురావటానికి కారణమేమిటా అని. సుశీల తనకు అనుకూలమైన భార్య అని భావించేవాడు మొదట్లో. కానీ తన కలలన్నీ కల్లలయినాయ్. సుశీల చీటికి మాటికి తనలో లేనిపోని తప్పులెంచి కస్సుమనటం మొదలెట్టింది. ఈ మార్పుకు కారణం అత్తగారి ప్రేరేపణే నేమోనని ఇప్పుడిప్పుడే ఊహించి ఆవిడ నోకంట కనిపెడ్తున్నాడు శ్రీహరి. పైగా కొత్తల్లో తన భార్యకు పూర్తి స్వేచ్ఛ యిచ్చినందువల్లనే ఇప్పుడు తన నింత చులకనగా చూడటానికి కారణమని కూడా భావించి ఇకనైనా సుశీలను అదుపాజ్ఞల్లో వుంచుకోకపోతే లాభం లేదనుకున్నాడు.

తలనొప్పిగా వుందని ఆవేళ అర్ధరోజు సెలవు తీసుకొని మధ్యాహ్నం దాదాపు రెండు గంటలకు ఇంటికి చేరుకున్నాడు శ్రీహరి. గదిలో అడుగు పెట్టగానే మేజా మీద కొత్త పట్టు బట్టలు కనిపించాయ్. సుశీల ఫ్లాస్కు తీసుకురాగానే, అధికార స్వరంతో "ఈ బట్ట లెక్కడివి?" అంటూ ప్రశ్నించాడు.

"మా తమ్ముడివి"

"ఇక్కడి కెందుకు వచ్చాయ్?"

"చెప్తా గానీ - కాఫీ పుచ్చుకోండి" అని గ్లాసును భర్తకు అందిస్తూ "నారాయణుడు దర్జీవాణ్ని పిలుచుకురావటానికి వెళ్లాడు... మనం ఏ పండగకూ కొత్త బట్టలు పెట్టేవ్వ లేదని వాడు నసుక్కుంటూంటే, మధ్యాహ్నం ఓ పది రూపాయలు వాడి మొహాన పారేశా, బజారు కెళ్లి ఇవి తెచ్చుకున్నాడు. వాడు ఎంత సంతోషపడ్డాడనుకున్నారు...కుంకాయ్—దారి పొడుగునా అందరికీ చెప్పుకుంటూ వచ్చాడుట - మనం బట్టలు కొనిచ్చామని" అంది భర్త కళ్లల్లోకి సంతోషంతో చూస్తూ.

కానీ శ్రీహరి గుడ్లెర్రచేసి "ఎక్కడిదే నీకా డబ్బు?" అని గర్జించాడు.

"మీరు నిన్న యింటి అద్దె ఇచ్చేసి వెళ్లారుగా - ఇల్లుగలావిడ వస్తే ఇవ్వమని... ఆమె మొన్ననే ఒంగోలుకు వెళ్లిందిట— కూతురికి ఒంట్లో బాగాలేదని జాబువస్తే.."

"అందుకని ఆ డబ్బుతో వస్త్రదానం చేశావన్నమాట... భేష్, బావుంది... బావుందే నీ సంసార లక్షణం - నన్నంటావు గానీ..."

"మీలాగ నేను అడ్డమైన ఖర్చులకూ, పేకాటలకూ తగలేయలేదుగా."

"నోర్ముయ్! ఇటుపైన నన్నేమైనా అంటే ఊరోక్కను. పళ్లు రాలగొడ్తాను... తెలిసిందా - ఏమిటనుకుంటున్నావో మరి.




# ★ సుడిగుండాలు ★

కూ కొనమానుకొడుక్కి బట్టలు పెట్టేనేమో అది దండుగ... ఇదిమాత్రం దండుగ కదూ?"

"నేనేం ముందూ వెనకా చూడకుండా దండగ చేయలేదు మీలాగ. మనం ఏ పండగకూ వాడికి బట్టలు కుట్టించివ్వలేదని వాడు అందరితోనూ చెప్పుకొని తిరుగుతూంటే, విని ఊరోర్కలేక కొనిచ్చాను. వాడు బండ్రోతులా బజారుకెళ్ళి సామానులు తెచ్చివ్వటమూ - ఇంకా ఎన్ని పనులు చేయటం లేదండీ వాడు?"

"ఇలా నాకు తెలీకుండా ఇంకా వేటికి డబ్బు తగలేస్తూన్నావ్?"

"ఇంకేం తగలేయలేదు. అంతగా అనుమానముంటే ఇహమీదట నావద్ద చిల్లిగవ్వయినా దాచిపెట్టకండి" అంటూ సుశీల అక్కడ్నించి లేచి వెళ్ళిపోయింది.

* * *

ఆవేళరాత్రి భార్యకు మంచిగా బుద్ధి గరపాలనుకున్నాడు శ్రీహరి: ఎందుకు సుశీలా!-ఇలా నేను ఇంటికి రాగానే లేని పోని పేచీలు లేవదీస్తావ్?...ఇటీవల ప్రతి రోజూ ఏదో ఒక గొడవ లేవతీస్తూనే వున్నావ్...చూడు సుశీలా!... ఎల్లకాలమూ మనమిలా గోరంత విషయాల్ని కొండంతలుగా పెంచుకుపోయి, చిన్నపిల్లల్లాగా కీచులాడుకోవల్సిందేనా. ఇంతవరకూ వచ్చిన అవమానమే చాలు. సిగ్గువున్నదానవైతే ఇహనన్నా నీ ప్రవర్తన మార్చుకో."

"ఆఁ—సిగ్గు! మిమ్మల్ని పెళ్ళాడిననాడే సిగ్గుకి తిలోదకాలిచ్చేశాను."

"అబ్బబ్బబ్బ...ఎన్నిమార్లు చెప్పాలి సుశీలా! ఇహనైనా తగ్గవే. ఇలా మాటలతో నన్ను హింసించి ఎందుకు చెడ్డవాడ్ని చేస్తావు చెప్పు.

"..............."

"మంచిదానివి కదూ...ఇలా తిరుగు." సుశీల మొహం తిప్పలేదు. బలవంతంమీద శ్రీహరి తనవైపుకు తిప్పుకోబోగా, సుశీల అతని చేతిని దూరంగా విసిరికొట్టింది.

"ఛీ - పశువా!"

"నేనేం కాదు"

"అంటే - నేనా?"

"..........."

ఆగ్రహం పట్టలేకపోయాడు శ్రీహరి. ఫెళ్లున సుశీల చెంపమీద ఐదువేళ్లూ అంటించాడు. సుశీల అరునొక్క రాగం ఆలపించ నారంభించేసరికి శ్రీహరి అవస్థలో పడిపోయాడు. సుశీల ఏడ్పులోనే మధ్యమధ్య శ్రీహరిని సూటిపోటిమాటలతో తీవ్రంగా గాయపరచసాగింది. శ్రీహరి కొంతవరకూ తాలిమి వహించాడుకాని, కృతిమించి రాగానపడేవరకూ అతని మనసు పట్టు తప్పింది. మళ్ళీ ఈదవడా ఆదవడా వాయించ నారంభించాడు. "అయ్యో!... అమ్మా!...చస్తున్నా - చస్తున్నా...నారాయణా! ... అమ్మా!" అంటూ సుశీల కేకలెట్టూండగా "ఛీ...నాపాలిటిశత్రువైనావ్" అంటూ గది తలుపులు తెరుచుకొని బయటికి వచ్చేశాడు శ్రీహరి.

"ఏమిటీ ... ఏం జరిగింది" - "ఏమిటయ్యా!...ఏమిటి" అంటూ పక్కవాటానించితలుపులు తెరుచుకొనిసుశీలతల్లీ, తమ్ముడూ పరుగునవచ్చారక్కడికి.

"ఆగండి!...వచ్చినదారినే వెళ్లండి ... మా గొడవల్లో అనవసరంగా జోక్యం కల్గించుకుంటే బావుండదు" అంటూ గదికి అడ్డంగా నిలబడి వాళ్లవంక తీక్షణంగా చూశాడు శ్రీహరి.

"సంసారంచేసేమనిషి వేషటయ్యానువ్వు-పెళ్ళాన్నలా బాదుకొట్టున్నావ్" అని రామమ్మ అంటూంటే "చావగొట్టటానికేనటయ్యా నీకిచ్చి పెళ్లిచేసింది ... మహా మొగాడివిలే పెళ్ళాన్ని కొట్టటంలో" అంటూ నారాయణుడు అందుకున్నాడు. ఫెళ్లుమనింది నారాయణుడి దవడ. వాడు కూడా ఎదురుతిరిగి శ్రీహరిని కొట్టబోగా సుశీల పరుగున లేచివచ్చి అడ్డుపడింది.

ఈ గోలకి ఇరుగూ పొరుగూ మేలుకొన్నారు. కాని ఇది వీళ్లింట్లో మామూలే కదా అని ఎవ్వరూ రాలేదు - ఒక్క ఎదురింటి అవధాన్లు తప్ప. అవధాన్లు రొప్పుతూ రోజుతూ వచ్చి "ఏమిటయ్యా నీ గొడవ రోజురోజుకీనూ - పగలూ లేదూ రాత్రీ లేదూ.....పక్కనున్నవాళ్లు మనుష్యులన్న సంగతి తెలియదటయ్యా నీకు. మేమైనా రాత్రిళ్లు కన్నుమూయాలా అక్కర్లేదా? పెద్ద న్యూసెన్స్‌గావుంది..."

"న్యూసెన్స్‌గా వుంటే న్యూసెన్స్ కేసు బనాయించు" అన్నాడు శ్రీహరి.

"కేసు పెట్టానో - నిన్ను ఈ వీధినించే తరమగొట్టానో చూస్తూండు"

"నీ చేతనయింది చేసుకో.....ఇలాటి మొహాలెన్నింటినో చూశాలే"

"రామమ్మగారూ! మీరూ మీ అబ్బాయీ వచ్చి ఈ రాత్రి మా ఇంట్లోనే పడుకోండి—తెల్లారి వచ్చేదురు గాని... అన్నిటికీ తెగించినవాడులా వున్నాడు, ఏమైనా చేయగలడు" అనేసి ఇహ అక్కడ ఓ క్షణం నిలవకుండా వెళ్లిపోయాడు అవధాన్లు. ఆయన వెనకనే రామమ్మ కూడా పడకచుట్ట చంకనబెట్టి కొడుకుతో వెళ్లి, ఆ రాత్రి ఆయ నింటి వసారాలో పడుకుంది. ఇక్కడ శ్రీహరి హాలులో చాప పరచి పడుకున్నాడు. సుశీల గదిలోనే కాస్సేపు వెక్కి వెక్కి ఏడ్చి తర్వాత కళ్లు మూసుకుంది.

* * * *

శ్రీహరి ఇప్పుడు ఎక్కువకాలం ఇంట్లో గడపటంలేదు. ఒక్కొక్క పూట ఇంట్లో భోజనంకూడా చేయటంలేదు. ఎంత అవసరం వచ్చినా భార్యతో మాట్లాడడు. సుశీల ఏమైనా అడిగినా దానికి జవాబు లేదు. సుశీల ఏడ్చేది, తల గోడకేసి బాదుకునేది, సూటిపోటి మాటలతో శూలంలా పొడిచేది. ఎన్ని చేసినా శ్రీహరి ఒకే నిర్ణయానికి వచ్చేశాడు. బెలంకొట్టిన రాయిలా ఇంట్లో మౌనముద్ర దాల్చేవాడు. చివరికి విసుగెత్తి ఇహ లాభం లేదని ఊరుకోవలసి వచ్చింది సుశీల. భర్త వంటింటికి రాగానే కంచంలో అన్నం వడ్డించేది. అతను నాలుగు మెతుకులు ఎంగిలిపడి లేచి వచ్చేవాడు. అటునైపు ముఖం తిప్పి "బియ్యం నిండుకున్నాయ్" అనేది సుశీల, అతను ఆఫీసుకి వెళ్లేముందు. శ్రీహరి ఏ జవాబూ చెప్పక వెళ్ళిపోయి సాయంత్రం కూలిచేత బియ్యంమూట మోయించుకొని వచ్చేవాడు ఇంటికి.

* * *

ఇలా శ్రీహరి దీక్ష ఎంతకాలమో కొనసాగలేదు. ఉన్నట్టుండి ఒక నాటి సాయంత్రం అతనికి చలితో జ్వరం ప్రారంభమైంది. ఆవేళ కూడా అతను భార్యను పల్కరించలేదు. జట్కాలో ఆస్పత్రికి వెళ్లి మందు తెచ్చుకున్నాడు. రెండుమూడు రోజులైనా జ్వరం అలానే వుంది. వొళ్ళు ఉడికిపోతోంది. వెర్రి వెర్రిగా ఏమేమిటో కలవరిస్తున్నాడు శ్రీహరి. సుశీలకు గాభరా వేసింది. పక్కవాటాలో తల్లివద్దకువెళ్ళి "అమ్మా అమ్మా! వారు నాతో మాట్లాడ్డం లేదే....భయంగా వుందే" అంది.

"ఆఁ...భయమెందుకే పిచ్చిపిల్లా- అతని సంగతి తెలియదు గనుకనా...పంతంపట్టి అలా మాట్లాడకుండా వున్నాడేకానీ, కపు జ్వరం ఇంకా ఎక్కువై..."

"ఛా - అవేం మాటలమ్మా! - నువ్వన వలసిన మాటలేనా అవి?...అన్నట్టు నారాయణు డేడీ?"

"ఎదురింటికి వెళ్లాడు, అవధాన్లగారబ్బాయివద్ద లెక్కలు చెప్పించుకునేందుకు—"

"ఓమారు పిలిచిరామ్మా! డాక్టర్ను తీసుకురావటానికి ఎవ్వరూ లేరు."

"వా డెక్కడ వస్తాడే...వాడికి కోపే

పరీక్షలు...చదువు పాడు చేసుకొని వాడ్నిలా వెళ్ళమంటావేం?"

"పోనీ నువ్వయినా వెళ్ళిరాకూడదటమ్మా—జట్కా పిలిపిస్తాను. నేనే వెళ్ళకద్దామనుకుంటే, వారిని ఒంటరిగా ఇంట్లో వదలి ఎలా వెళ్ళగలను చెప్పు."

"నేనుమాత్రం ఎలా వెళ్ళగలనే..." మాటా మళ్లీ సర్దుకోవాలి...మూడు గంటలకే బస్సు—"

"బస్సా!!! ఎక్కడికి కెళ్తున్నావమ్మా?"

"ఇంకెక్కడికే - మన ఊరికే...అక్కడ పొలం పనులు ఎంతవరకూ వచ్చాయో ఏమో...నాపాటికి నేనిక్కడ కూర్చుంటే అక్కడ పనులు సాగుతాయా...తక్షణమే బయలుదేరి రావలసిందని కరణం రాశాడు కూడానూ."

"అదేంటమ్మా...ఇటువంటి పరిస్థితుల్లో నన్నిక్కడ ఒంటరిగా వదలి వెళ్తున్నావా?"

"ఆ...ఐనా నే నిక్కడవుండి నిన్ను ఉద్ధరించేదేమిటెలే... నాకేమో ఈ వూరు వచ్చ లేదమ్మాయ్. ఈ కొళాయినీళ్ళు నాకు పడలేదు. కొన్నాళ్ళు గాలిమార్పయినా కావాలి. నే వచ్చేవరకూ నారాయుడ్ని వాళ్ళింట్లోనే వుంచుకుంటానన్నారు అవధాన్లు. వాడి తిండికీ, వసతికీ అయనింట్లోనే ఏర్పాట్లుచేశా. వాళ్లబ్బాయి నారితో పాటు చదువుకొంటూంటాడు. ఊరికెళ్ళి వాడి బడిజీతానికీ, పుస్తకాలకూ డబ్బు పంపించాలి. అవధాన్లగారికి బియ్యమూ, వగైరాలు పంపించకపోతే బావుంటుందా? ఆయనకుకూడా కొంతయినా డబ్బు పంపించాలి."

"అంతేనా అమ్మా?"

"ఆ...అంతే...మళ్ళీ ఓవారం పది రోజులకు వచ్చేస్తానుకాదుటే - "

"అమ్మగోరూ!" అన్న కేక వినపడింది. అదిరిపడి వెనుతిరిగిచూసింది సుశీల. అతను ఆఫీసుప్యూన్ సుబ్బరామయ్య. "అయ్యగారికి ఎలావుందో చూసి రమ్మన్నారండీ"

సుశీల నిట్టూర్చి "అలాగే వుంది సుబ్బరామయ్యా ... జ్వరం ఎక్కువైందని చెప్పు మీ అయ్యగారితో - చూడు సుబ్బరామయ్యా! దేవుడిలా వచ్చావ్ సమయానికి ... ఓ చిన్న సాయం చేసిపెట్టాలి. మంచి డాక్టర్ ఎవరైనావుంటే వెంటనే జట్కాలో పిల్చుకురా, నీకో పావలా డబ్బులిస్తాను... నీమేలెన్నటికీ మరువను."

"ఎంతమాటతల్లీ - ఇప్పుడే పిల్చుకు రానూ" అంటూ వెళ్ళాడు.

డాక్టర్ రాగానే శ్రీహరిని పరీక్షచేసి "ఇప్పుడెవరినైనా పంపించండి - మందు పంపుతాను ... మీరేం ఖంగారుపడకండి, త్వరలో నెమ్మదవుతుంది ... మళ్ళీ రేపు వచ్చి చూస్తాను" అనేసి వెళ్ళిపోయాడు. సుబ్బరామయ్య చేతికి సీసానిచ్చి పంపించింది సుశీల. వాళ్లలా వెళ్లగానే చంకన మూటతోవచ్చింది రామమ్మ. "డాక్టర్ వచ్చి వెళ్ళినట్లున్నాడు - ఏమన్నాడే" అని ప్రశ్నించింది.

సుశీల జవాబివ్వలేదు.

"ఆ...ఏమంటాడులే - మామూలుజ్వరమేగా ... నువ్వు అనవసరంగా లేనిపోని బెంగపెట్టుకొని నీ ఆరోగ్యం పాడుచేసుకోకు సుశీలా! దానంతట అదే తగ్గిపోతుందిలే...వెళ్ళి, మరో పది పదిహేనురోజులకంతా వచ్చేస్తాను ... మా ఇంటివైపు ఒక కన్ను వుంచు. రేపు తెల్లవారి పాలవాడూ, పెరుగుమనిషీ వస్తే, నేను వచ్చాక డబ్బు ఇస్తానని చెప్పు. మీకు ఇవ్వాల్సిన ఇంటి బాడుగ డబ్బులుకూడా నేను ఊర్నించి వచ్చినతర్వాత ఇస్తాలే...ఏం?...ఆయనకు జ్వరంతగ్గాక నాకో జాబు రాయించు... వెళ్ళనా?" అంది.

సుశీల తలఎత్తయినా ఆవిడవంక చూడలేదు.

"వస్తానే!" అంటూ తిరుగు జవాబుకు ఎదురుచూడకనే నిష్క్రమించింది ముసలావిడ...సుశీల కళ్లల్లో నీళ్లు నిలిచినై.

* * *

మూడు రోజులు గడిచాయ్...సుశీల భర్త నుదుటిపై చెయ్యివేసి చూసింది. ఇంకా ఉడికిపోతూనే వుంది. సుశీల క్రితం రోజంతా గొంతులో పచ్చిమంచినీళ్లయినా పోసుకొని ఎరగదు. కళ్లు తిరుగుతున్నాయ్. కడుపులో అదేదో మంట. మెల్లిగా లేచి వంటింటివైపుకు పోబోయింది. ఈలోగా ఎవరో వీధి తలుపు తట్టారు. వెళ్ళి తలుపు తీసింది. తమ్ముడు నారాయణుడు! వాడి వేషభాషల్లో ఎంతో మార్పు వచ్చినట్లు తోచింది సుశీలకు.

"ఏమిట్రా - ఇక్కడకు రావడమే మానేశావే?" ప్రశ్నించింది సుశీల.

"ఎక్కడక్కయ్యా! స్కూలూ, చదువూ - వీటితోనే తీరిక లేకుండావుంది"

"ఈ చొక్కా నే కుట్టించిందేకదూ?"

"ఔను."

"రా లోపలికి-బయటనే నిలబడ్డావేం?"

"స్కూలుకు వెళ్లాలక్కా! టైం లేదు. అమ్మదగ్గర్నించి జాబు వచ్చింది. నీకు కూడా ఏదో రాసింది - ఇచ్చిపోదామని వచ్చాను," అంటూ జేబులోంచి ఒక కాగితాన్ని తీసి సుశీల చేతికిస్తూ "వస్తానక్కయ్యా!" అంటూ జవాబుకు ఎదురుచూడకుండానే మెల్లిగా జారుకున్నాడు.

సుశీల అక్కడే నిలుచొని జాబు సాంతం చదివాక దానిని ముక్కలు ముక్కలుగా చింపి వీధిలో పారేసింది. ఆ జాబులో రామమ్మ ఏమని రాయించిందో కానీ, సుశీలకు ఈమారు ఆవిడమీద ఎక్కడలేనంత కోపం వచ్చేసింది. రోత పుట్టింది.

"సుశీలా! సుశీలా!!" అంటూ శ్రీహరి పలవరించాడు. ఒక్కపరుగున భర్త మంచం వద్దకు వచ్చి "ఏమిటండీ? ఏమిటండీ?"అంది ఆతురతతో.

శ్రీహరి కళ్ళు మూసుకునే వున్నాడు. కాస్సేపటికి పెదవులు చప్పరిస్తూ "ఈరోజు తారీఖుఎంత?"అని మూల్గాడు. భర్తనోట మాటవిని చాలారోజులయినట్లనిపించింది. "తారీఖా?...వుండండి చెప్తాను" అంటూ కన్నీళ్ళు తుడుచుకుని, కేలండర్ కేసిచూసి "పదిహేడు" అంది.

"అయితే నేనీస్టేషన్లోనే దిగిపోవాలన్నమాట" అన్నాడు శ్రీహరి ఏదో మత్తుగా...

"ఆ ... ఏమన్నారూ? ఏమిటండీ ... ఏమిటండీ" అంటూ సుశీల పదేపదే అడిగింది. కాని మళ్లీ జవాబు లేదు.

డాక్టర్ వచ్చి "మరేం పరవాలేదమ్మా? ...నేను ఒక ఇంజక్షన్ రాసిస్తాను. అది తెప్పించండి. రేపీపాటికి వచ్చి ఇంజెక్షన్ ఇచ్చిపోతా. నాకూ అర్థంకాకుండా వుంది ఈ జ్వరం ఇంకా ఎందుకు తగ్గలేదో" అంటూ ఇంజెక్షన్ పేరు రాసిస్తూ "ఆరు ట్యూబులకు పన్నెండు పదమూడు రూపాయలు కావొచ్చు. మాత్రలు వేరే రాసిచ్చాను—వాటికి ఐదు రూపాయ లవుతుందేమో...మీరేం దిగులు పడక్కర్లేదు—త్వరలో దిగుముఖం పెట్టుంది-మధ్యాహ్నం మా మనిషిచేత బిల్ పంపిస్తాను, దాని తాలూకు పైకం పంపించండి...వస్తాను" అంటూ డాక్టర్ వెళ్లిపోయాడు.

సుశీల ప్రశాంతంగా వున్న భర్తమొహం కేసి తర్వాత మందు చీటీకేసీ చూసింది. దుఃఖం పెద్ద ఉప్పెనలా ముంచుకొచ్చేసింది.

"అమ్మా!!!"

మెల్లగా వెనుతిరిగి చూసింది. కళ్ళల్లో నీళ్లుండడంచేత సుబ్బరామయ్య స్వరూపం మసక మసగ్గా కన్పిస్తోంది.


"డాక్టర్ గారు వచ్చారా అమ్మా?"

"ఆ...ఇప్పుడే వచ్చి వెళ్ళారు."

"ఎలా వుందమ్మా - అయ్యగారికి?"

సుశీల ఒక్క నిట్టూర్పు విడిచి "సుబ్బరామయ్యా! మీ అయ్యగార్ని అడిగావా నే చెప్పింది?"

"అడిగానమ్మా...ప్చ్...ఇదివరకే బాబుగారు వందరూపాయల అప్పు పుచ్చుకున్నారట. ఇహ ఒక్క రాగిపైసాయైనా ఇవ్వనంటున్నాడు."



మోటబావిలో....

## ★ సుడిగుండాలు ★

సుశీల గద్గదస్వరంతో "సుబ్బరామయ్యా! నువ్వు తప్ప నాకీ సమయంలో సహాయం చేయగలవారు మరెవ్వరూ లేరు... నాకో చిన్న సాయం చేసిపెట్టాలి" అంది.

"ఎంత మాటమ్మా... చెప్పండి"

"ఉండు - వస్తా" అంటూ గదిలోకెళ్లి, తన తల్లి పెళ్లికి ముందు ఎప్పుడో చేయించిన ఒక జత గాజులను పెట్టెలోనించి తీసి వాటికేసి అలా చూసింది. ఆవిడ నయనాల నించి అశ్రువులు జలజలరాలాయ్. తర్వాత వాటిని తెచ్చి సుబ్బరామయ్య చేతికిస్తూ "వీటిని ఎక్కడైనా తాకట్టు పెట్టి ఓ యాభై రూపాయలు తీసుకురాగలవా?" అంది.

సుబ్బరామయ్య చేతులు వొణక నారంభించాయ్. "ఇదేవిటమ్మా... ఇదేం పని" అన్నాడు బొంగురుపోయిన కంఠంతో.

"వేరే మార్గం లేదు సుబ్బరామయ్యా! వారికి త్వరగా నయమైతే వీటిని విడిపించుకోవడం కష్టమా—ఇలాటివి ఎన్నయినా చేయించి ఇవ్వగలరు... త్వరగా వెళ్లిరా... ఇంజెక్షన్లూ, మందులూ కొనాలి... డాక్టర్ గారి బిల్లు చెల్లించాలి... పో సుబ్బరామయ్యా!... ఊఁ... పో" అంటూ తొందర చేసింది. సుబ్బరామయ్య మరేమీ మాట్లాడక, మంచం మీద నిద్రావస్థలోనున్న శ్రీహరికేసి ఒక్క చూపు చూసి, మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ నడక సాగించాడు.

* * *

ఇంజెక్షన్ ప్రభావంవల్లనో లేక సుశీల పరిచర్యలవల్లనో శ్రీహరికి జ్వరం తగ్గుముఖం పెట్టుతూ వచ్చింది. మెల్లగా లేచి కూర్చోగలుగుతున్నాడు... అప్పుడప్పుడూ తెలివిగా మాట్లాడుతున్నాడు. ఇహ సుశీల ఆనందానికి అంతులేదు.

"జావ సిద్ధంగా వుంది—తెచ్చివ్వనాండీ!" అంది భర్తకళ్ళల్లోకి దీనంగా చూస్తూ.

"ఊఁ" మూల్గాడు శ్రీహరి.

పరుగున వెళ్ళి జావ తెచ్చియిచ్చింది. జావ మెల్లిగా తాగుతూ, భార్య కళ్లల్లోకి జాలిగా ఒక్క చూపు చూశాడు శ్రీహరి. సుశీలకూడా అతని కళ్లల్లోకి చూసింది. ఆవిడ కళ్లు చెమ్మగిల్లాయ్. అంతే! చివాలున భర్తపాదాలమీద వాలి "నన్ను క్షమించరూ?" అంది వెక్కి వెక్కి ఏడుస్తూ.

"ఆఁ...?—ఎందుకూ?"

"నేను మీపట్ల చాలా అన్యాయం చేశాను. వీళ్లూ వాళ్లూ ఆడిన మాటలు విని లేనిపోని అపోహలతో సంసారంలో తుఫాను రెచ్చగొట్టాను. నా కిప్పుడు తెలిసి వచ్చింది... నేను పాపిని. మీరు క్షమిస్తానంటేగానీ లేవను - లేదా, ఇక్కడే, మీ పాదాలవద్దనే ప్రాణాలు వదుల్తాను..." అంటూ ఆవేశంతో సుశీల చెప్తూంటే, శ్రీహరి వొణికే చేతులతో ఆవిడ తలమీద మెల్లిగా దువ్వాడు. అతని కళ్లల్లోకూడా నీళ్లు ఉబికినా, లేని నవ్వు తెచ్చుకున్నాడు. "పిచ్చిదానా... ఏమిటిదంతా ...లే" అన్నాడు. అతనినోట అలాటి చల్లటిమాట విని ఎన్నోమాసాలయింది.

మరో మూడురోజులకు శ్రీహరి మామూలు మనిషైపోయాడు. ఆఫీసుకు వెళ్తున్నాడు. హోరున పెద్ద గాలివానవచ్చి వెలసిన తర్వాత ఎంతటి ప్రశాంతత ఆవరిస్తుందో - అంతటి నిర్మల వాతావరణం ఏర్పడిం దిప్పుడు వారి సంసారంలో. జరిగిపోయిన దుర్దినాలను ఆ దంపతులు పూర్తిగా మరచిపోయారు.

శ్రీహరి ఆఫీసు వదలగానే తిన్నగా ఇంటికి చేరుకుంటున్నాడు. భర్త ఇంటికి రాగానే సుశీల సకలోపచారాలు చేసి, తియ్యటి కబుర్లతో - సరససంభాషణలతో అతన్ని సంతోష పెట్టూంది.

ఆరాత్రి—

ఎనిమిదిగంటలు కావొస్తోంది. దంపతులిద్దరూ భోజనాలు ముగించి, హాలులో కూర్చొని తమలపాకులు నెమరు వేస్తూ రేడియో వింటున్నారు.

"ఏమండీ" పిలిచింది సుశీల మౌనాన్ని ఛేదిస్తూ.

"ఆఁ..."

"మనం వచ్చేనెలలో తిరుపతికి వెళ్లాలండీ"

"ఏం? - ఎందుకూ?"

"మొక్కుకున్నానండీ - మీకు త్వరగా నయమైతే నిలువుదోపిళ్ళిస్తానని - "

"దంపావుహో ... అంత డబ్బు ఎక్కడ్నించి తేను?"

"ఛా...తప్పండీ...అలా అనకూడదు" అంటూ శ్రీహరి నోటికడ్డంగా చేతులుంచింది సుశీల. అంతే ఉన్నట్లుండి స్పృహతప్పినట్టు పడిపోబోయింది. శ్రీహరి గాభరాతో "సుశీలా!" అని ఒక్క గావు కేకెట్టాడు. సుశీల తెప్పరిల్లి తాపీగానే "మరేమీ లేదు...గాభరా పడకండి...ఇలా దగ్గరకు రాండీ" అంటూ అతని చెవిలో ఏదో చెప్పింది.

ఆమాట వినగానే శ్రీహరికి నిలుచున్న పళంగానే మూడు మొగ్గలు వేద్దామా అనిపించి వుంటుంది ఆ ఆనందంలో. "దొంగా! ఇన్నాళ్ళుగా చెప్పావు కావేం...ఎన్నో మాసం?" అన్నాడు భార్యను దగ్గరికి తీసుకుంటూ. ఇంతలో వీధితలుపు తట్టిన చప్పుడైంది.

"ఎవరూ?" అన్నాడు శ్రీహరి.

"నేనే...తలుపు తియ్యండి" అని జవాబు వచ్చింది. సుశీల ఆ గొంతును ఆనవాలు పట్టటానికి ఎంతోసేపు పట్టలేదు. తిన్నగా తలుపుదగ్గరికి వెళ్ళి, గొళ్లెం తియ్యకుండానే "ఏం!...ఎందుకూ?" అంది.

"తలుపు తియ్యవే అమ్మాయ్!- ఇప్పుడే ఊర్నించి వస్తున్నా...అల్లుడుగారు ఖులాసాగా వున్నారా?"

సుశీల వేళాకోళంగా "ఆఁ...ఖులాసాగానే వున్నారు. పాపం, ఎంత అపేక్ష - ఏమి కథా!...అంతేనా నీకు కావాల్సిన జవాబు. ఇహ దయచేయ్...వచ్చే ఫస్టుకు మీరు ఇల్లు ఖాళీచేసి వెళ్లండి, మేమూ వేరే ఇంటికి వెళ్లిపోతున్నాం."

"అదేమిటే సుశీలా ! - అలా మాట్లాడ్తున్నావ్ ? ... తలుపు తియ్యి" అన్నాడు శ్రీహరి.

"ఎందుకు తియ్యాలండీ—?"

"పాపం - ఇప్పుడే ఊర్నించి వచ్చానంటూంది."

"ఎప్పుడైనా రానివ్వండి...ఆవిడకు మనతో ఏం పనీ?...ఇటుపైన ఆవిడ నాకు తల్లీ కాదు, నేను ఆవిడకు కూతుర్నీ కాను... మీకు జ్వరంగా వున్నప్పుడు, తోడుగా ఓ రెండురోజులు వుండమంటే - ససేమిరా వుండనని, అక్కడేదో కొంప మునిగిపోయినట్లు పల్లెకు ఏకాఏకీన ప్రయాణమై వెళ్ళింది.


"ఇంత జరిగినా నీ కింకా కష్టసుఖాలు తెలియలేదు సుశీలా!" అన్నాడు శ్రీహరి.

"—అక్కయ్యా! తలుపు తీస్తావా - తియ్యవా?" అన్నాడు నారాయణ.

"తియ్యను పోరా - ఏమిటో మహా వెడిరిస్తావ్!...మీ బావగారు జ్వరంతో పడుకొనివుంటే, వారి కెలావుందో—ఒక్క రోజయినా మా ఇంటిలో తొంగిచూసి పోయావుట్రా?"

అంతే - తర్వాత వాళ్లగొంతులు వినపడ్లేదు.

భార్యవంక దిగ్భ్రమతో చూస్తూ వుండిపోయాడు శ్రీహరి! ★



....ఈదులాట — ఫొటో: వి. అంకిరెడ్డి—కడప.